# ముసుగు

"టంగ్! టంగ్! టంగ్!" అని గోడగడియారం ఇంకా పదికొట్ట లేదు. అందుకనే నేను రిక్షాలో ఉన్నాను. పదికొడితే నేను కోర్టులో ఉండాలి.

తప్పు చేసి నేను కోర్టుకు పోవడంలేదు. తప్పు చేసినవారు ఎప్పుడో ఒకప్పుడు కోర్టుకెడితే నేను రోజూ వెళ్ళాలి.

రిక్షా టాపు తీయించి కూచున్నానేమో, చుట్టుపక్కల అన్నీ కని పిస్తున్నాయి.

అక్కడ—

పోలీసులు సైకిల్సు పట్టుకుంటున్నారు. పది రోజుల క్రితం ఇదే టైముకి ఇక్కడ నాలుగొందల సైకిళ్ళదాకా పట్టుకోవడం చూసాను. కోర్టులో ఇక ఆ గొడవతోటే సరిపోతుందనుకొని కంగారు కూడ పడ్డాను. కాని వచ్చినవి పది పదిహేను సైకిల్ కేసులే. అంటే సగం కోర్టు పోలీసు స్టేషన్‌లోనే అయిపోయిందన్నమాట.

నిజమే!

పోలీసు స్టేషనుకు కూడా పోనక్కర లేకుండానే ఆ బాపతు చాలా మటుకు పైసలా అయిపోతాయి.

నేను—అప్పటి కింకా మేజిస్ట్రేటు కాలేదు. ఒకసారి పోలీసులు పట్టుకున్నారు. నిజానికి నా తప్పేమీ లేదు, పట్టుకుని రెండ్రూపాయ లిమ్మంటే ఇవ్వనన్నాను.

కోర్టులో అప్పటి మెజిస్ట్రేటుగారు-

"మీరు కూడ రాంగ్‌సైడు పోతే ఎలాగండి" అంటూ నవ్వేసి సైకిలిప్పించేసారు. నేను రాంగ్‌సైడు పోలేదని ఎంత మొత్తుకున్నా ఆయన వినలేదు. పైగా పోలీసడిగిన లంచం గురించి చెపితే అలాటి విషయాలు చూసీ చూడనట్లు వదిలివేయాలన్నారు.

చూసీ చూడనట్లు వదిలివేయుటమేమిటో తనకి ఇప్పటికీ అర్థం కాని విషయం.

"దిగండి బాబూ!"

ఆలోచిస్తున్నానేమో రిషా అబ్బాయి గుర్తు చేస్తేనే కానీ తెలియ లేదు, కోర్టు వచ్చిందని. పైసలిచ్చి నాగదికి వెళ్ళాను.

పది కావడానికి ఇంకా అయిదు నిమిషాలుంది. ఏ విషయంలో పంక్చువల్‌గా ఉన్నా లేకపోయినా టైము విషయంలో మాత్రం పంక్చు వల్‌గా ఉంటాం మేము.

కావలసిన సరంజామాలన్నీ వంటిమీద పడేసుకుని పదికావటం కోసం చూస్తున్నాను. నన్ను కోర్టులో దింపేసి పోయి చుట్టకాల్చుకుందుకు చూస్తున్నాడు జోసఫ్.

నాకసలీ కోర్టులన్నా కోర్టు బట్టలన్నా ఎంతో చిరాకు. ఈ వృత్తి లోకి రాకముందు పదేపదే అనుకునేవాణ్ణి.

"లోకంలో న్యాయాన్ని ధర్మాన్ని చంపేయటానికి ఎన్ని కోర్టులు, ఎన్ని నల్ల కోటులు" అని.

కాని నాకు కోర్టులోనే ఉద్యోగం వచ్చింది. ఆరేళ్ళకి రిటైరవుతా ననగా ప్రమోషన్ వచ్చింది.

అందుకే ప్రమోషన్ వదులుకుందుకు మనసొప్పింది కాదు. ఆ ఆలోచన మా ఆవిడ సాగనిచ్చిందీ కాదు.

ఏడవడానికి కూడ ఓపికలేని పేదవాడిలా గడియారం నీరసంగా పది కొడుతూంది.

"సైలెన్స్"...ఉష్"...ముందు జోసఫ్ అరుచుకుంటూ పోతుంటే అతన్ని అనుసరించి కోర్టుకెళ్ళాను.

నన్ను చూసి అందరూ లేచి నుంచున్నారు.

నేను కూచున్నాను. వారంతా కూడ కూచున్నారు.

బెంచి గుమస్తా కోర్టు భాషలో ఏదో గొణిగాడు నాతో. ఆ తర్వాత ఆసామీ పేర్లు కేసు వివరాలు చెప్పాడు.

సైకిలు కేసు—

"నేను రాంగ్ సైడు పోకుండానే నన్ను పట్టుకున్నారు సార్!"

"ఇది చాల అన్యాయమండి'' అన్నాడు సైకిలబ్బాయి.

నిజంగానే అన్యాయమేమోననిపించింది నాకు.

కాని ఇప్పుడితన్ని ఫైన్ వేయకుండా వదిలేస్తే మిగతా యిద్దరు, ముగ్గురు కూడ ఇదే ధోరణిలో మాట్లాడవచ్చు.

"నాలుగు రూపాయలు" అప్రయత్నంగా అన్నాను నేను. పోలీసు పట్టుకున్నపుడే బ్రతిమాలి రూపాయో రెండో వాడి మొహాన కొడితే అప్పటి కప్పుడే సైకిలు పట్టుకుపోవచ్చు. నాలుగు రోజులాగి, నాల్గు రూపాయలు ఫైన్ కట్టడమే కాకుండా కోర్టు దగ్గర యీ వెధవ వైటింగ్ దేనికి? అని ఆ మనిషి అనుకుంటున్నాడేమో! నిజానిజాలు తెలుసు కోకుండా అధర్మం వైపు ఒక మనిషి మనసును మళ్ళిస్తున్నానేమో!

కాని ఇంత చిన్న కేసు దగ్గర్నుంచీ నేను విపులంగా పరిశీలించడం మొదలు పెడితే యీ కేసులన్నీ ఎప్పుడు తరుగుతాయి. అసలిలాటి కేసుల్ని విపులంగా పరిశీలించటమెలాగ?

మరో రెండు సైకిలు కేసుల తర్వాత-

ఒకతను పాలల్లో నీళ్ళు కలిపాడుట, ఫుడ్ అడల్టరేషన్ నేరం కింద తీసుకొచ్చారు.

"పాలలో నీరు కలిపావా?"

"లేదు"

"మరి మీటరు వేస్తే నీరు కలిసినట్లు రీడింగ్ వచ్చిందేం?"

"నాకు తెలియదు"

పాలల్లో నీళ్ళు కలపటం నేరమే. కాని దాని వలన కలిగే నష్టం కన్నా, దేశంలో ప్రతి పదార్థంలోనూ ఉండే అంతో ఇంతో కల్తీని ఎంత వరకు అరికట్ట గలుగుతున్నాం మనం? అలా అరికట్టడానికి ఎంతవరకూ ఉపయోగ పడుతున్నాయి ఈ న్యాయస్థానాలు?

ఆ కేసు కొట్టేశాను.

ఉదయం కోర్టు ఇక చాలన్నట్లు విరామ సమయంగా గంట మోగింది. సీట్లోంచి లేచాను.

* * *

మధ్యాహ్నం కోర్టు—

ఒక ఆడమనిషి బోనులో నిలబెట్టబడింది

"ఏం కేసు?"

"అదే సార్! లాడ్జింగు కేసు"

"తప్పు చేసావా?" అడిగాను నేను. ఇరవైకి ఇరవై అయిదుకు మధ్యనుంటుందా మనిషి వయసు.

"చేశాను"

"ఏం తప్పు"

"అదే బాబూ"

"ఎందుకు చేసావు?"

హెడ్డు బాబన్నట్లు ఒల్లు కొవ్వెక్కి మాత్రం కాదు" చెప్పిందామె.

"మరెందుకు చేశావు?"

"అది సరేగాని బాబూ! నన్ను మనువాడతానని సెప్పి నమ్మించి ఈడకి తీసుకొచ్చి సరదా తీరాక పరారయిపోయిన జోగులుగాన్ని సిచ్చించదానికి మీ షత్తకాల్లో ఏం ఉండదా బాబూ?"

ఏం చెబుతాను నేను? అలాంటి నిరూపించలేని నిజాలను 'లా' ఒప్పుకోదని ఎలా చెప్పగలను?

"బాబూ! మెయిస్ట్రేటు బాబూ! అప్పటికి మీరింకా ఈడకి రాలేదు. ఓ పోలీసాడు తనకు కేసులు లేవని, నువు పాతకేసువే కందా కోర్టుకు రావే, పయిను నేను కట్టుకుంటానని బతిమాలితే, పోలీసోడు ఎప్పటికైనా ఉపయోగమే గందా అని కోర్టుకొచ్చినా. పది రూపాయలు పయినేశాడు దొర. అడు నాకు పైచియ్యలేదు సరిగంవా ఆడబ్బు నాచేత కట్టించి, నన్నిట్టం వచ్చినట్టు.....ఎందుకులే దొరా! అలాటి సన్నాసోడికి సిచ్చేయటం, నాలాటిదానికన్యాయం జరక్కుండా సూట్టం మీవల్ల కాదా బాబూ!"

మరో జవాబు లేని ప్రశ్న. ఏం చెప్పగలను నేను?

"పోనీలే బాబూ! ఆ గొడవెందుకులే. ఈ సారి నిజంగానే తప్పు సేసినా, వొల్లు కొవ్వెక్కికాదు. తిండికి లేక, అదయినా నా కోసం గాదు. గుంటది, మా సంటిదాని కోసం. ఎయి బాబూ! ఫయినే ఏత్తావో, జెయిలే ఏత్తావో ఎయి! జెయిలేత్తే పసి కందును కూడ ఏదో మతలబెట్టి జెయిల్లోనే ఎయ్!"

ఆలోచించి, మినిమమ్ ఫైన్ వేసి పొమ్మన్నాను.

తరువాత కేసుకి ఫార్మాలిటీస్ పూర్తి చేశాడు గుమాస్తా.

''ఎందుకు చేశావీపని?'' అడిగాన్నేను.

"ఇదివరకు ఆడోల్లనే, లాడ్జింగులకీ మరోసోటికి తీసికెల్లిన మాట నిజమే బాబూ! ఈ పాలి, ఇది నా సెల్లెలు బాబూ.''

"అంతా అబద్ధం" మధ్యలో హెడ్డు మాట్లాడాడు.

"సత్తెపమాణ పూర్తిగ సెబుతున్నాను బాబూ! అది నా సెల్లెలే... మొన్ననే ఊర్నుంసొచ్చింది. సినిమాకి తీసికెల్లమంటె తీసికెడుతున్నా. ఈల్లకి కేసులు లేవని, నన్నట్టుకున్నారు. అది నిజంగా నా సెల్లెలే బాబూ! కావాలంటే మా సుట్టుపక్కలోల్ల నడగండి''.

నా మనసదోలా అయిపోయింది. ఏమిటో ఒక్కోరోజు అన్నీ ఇలాటి కేసులే!.

''సరే ఆమె నీ చెల్లెలే అనుకుందాం. మరిదివరకు లాడ్జింగులకీ అక్కడికీ జనాన్ని తీసికెళ్ళానన్నావ్, అది తప్పే కదూ!" అడిగాన్నేను

"అలా అడగండి'' అన్నట్టు చూసాడు హెడ్ కానిస్టేబుల్.

ఒకసారి ఊపిరి పీల్చుకున్నాడు రిక్షా అబ్బాయి. ఆ శబ్దం నాకు గట్టిగా వినిపించింది.

''నానొక ఇసయం అడుగుతా బాబూ! ఏమనుకోమాకండి రోజుకి ఎంతో కొంత మంది ఆ ఎదవపని సేత్తున్నారు. ఆల్లని రిచ్చాలో తీసికెల్లటమే తప్పయితే ఆల్లు సేసేది ఎంత తప్పు? అయినా తప్పుసేసినోల్లందరిని సిచ్చిస్తున్నారా మీరు? సేదు ఎందుకని? ఆల్లు మీ ఎరిక నోకి రానేదు గనుక. అంతేనా? మీ ఎరికలో కొస్సేదే నాయమయి మీ ఎరికలో లేనిది అన్నాయం అవుద్దంటారా,''

"……………………"

"మాదేవుంది బాబూ. కిరాయి మీద బతికే వోల్లం. ఆ మేడలో నాలుగు పైచనెక్కువిత్తరనిగాని మరేం నేదు. అయినా బాబూ! అల్లు తీచికెల్లమంటేనే తీచికెడుతున్నాం గాని, ఆల్లని బలవంతం సేత్తన్నామా సెప్పండి" అని ఆగిపోయాడతను.

అతనికి ఏమీ ఫైను వేయకుండానే పొమ్మన్నాను. న్యాయానికి ముసుగు వేస్తున్నంత మెల్లగ కోర్టుగంట మోగింది.